సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం | 29 | ఆగస్టు | 2025



సెలవుపై వెళ్లొద్దు

భారీ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో అధికారులు సెలవుపై వెళ్లొద్దని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. 10లో▸



హామీల అమలులో విఫలం

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి విమర్శించారు. 10లో▸



నానోతో లాభాలెన్నో..

నానో యూరియాతో ఎన్నో లాభాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ఆమనగల్లు తహసీల్దార్‌గా మహ్మద్ ఫయీం ఖాద్రి



ఆమనగల్లు: మండల నూతన తహసీల్దార్‌గా మహ్మద్ ఫయీం ఖాద్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన లలితను లంచం తీసుకుందనే కారణంతో పది రోజుల క్రితం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీంతో ఆమెను కలెక్టర్ నారాయణరెడ్డి సస్పెండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో యూఎల్‌సీ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మహ్మద్ ఫయీం ఖాద్రిని తహసీల్దార్‌గా నియమించారు.

నిమజ్జనం వేళ జాగ్రత్త



బొబ్బిలి చెరువును పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రుల్లో భాగంగా నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. బొబ్బిలి చెరువు, దూసకల్, బుచ్చిగూడ చెరువులను గురువారం ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మండప నిర్వాహకులకు చెరువులను విభజించి రూట్ మ్యాప్ ఇవ్వాలని, దాని ప్రకారం నిమజ్జనాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో నీరు నిండుగా ఉందని, నిమజ్జన సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. డీసీపీ వెంట మున్సిపల్ కమిషనర్ సునీత, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాంచందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



సాహితిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ కోర్టు అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా మల్యాల సాహితి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలరావు, ప్రధానకార్యదర్శి గుండు బావి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ కమిటీ సమావేశం నిర్వహించి సాహితికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాహితి మాట్లాడుతూ.. న్యాయమూర్తిగా ఎన్నికైన తరువాత మొదటిసారి షాద్‌నగర్ కోర్టులో బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

108 అంబులెన్స్ వాహనం తనిఖీ



కందుకూరు: 108 అంబులెన్స్ వాహనాన్ని గురువారం 108 జిల్లా అధికారి రాజబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుతో పాటు ఆక్సిజన్ సరఫరాను పరిశీలించారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలని, ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ సురేందర్, పైలెట్ షఫీ పాల్గొన్నారు.

ప్రోకబడ్డీ లీగ్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా శ్వేతారెడ్డి

చేవెళ్ల: ప్రోకబడ్డీ 12వ సీజన్‌కు తెలంగాణ నుంచి టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని చిర్మని శ్వేతారెడ్డి అన్నారు. మండలంలోని చనువెల్లి గ్రామానికి చెందిన శ్వేతారెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల ఢిల్లీలో ఏకేఎఫ్ఐ నిర్వహించిన శిక్షణ శిబిరంలో దేశవ్యాప్తంగా 44మంది ఎంపిక కాగా తెలంగాణ తరఫున తాను అర్హత సాధించినట్లు తెలిపారు. తనను ప్రోత్సహించిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత ప్రసాద్‌రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రిటైర్డు హెడ్ కోచ్ నటరాజన్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్, ప్రధాన కార్యదర్శి ఎం.మహేందర్‌రెడ్డి, రిఫరీ బోర్డు చైర్మన్ పి. సత్యనారాయణ, కన్వీనర్ అనిల్ కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీదేవిపల్లిలో కదలిక!

చౌదరిగూడలో స్థలాన్ని పరిశీలించిన ఇంజనీర్ల బృందం

- రంగారెడ్డి-పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఇదే చివరిది
- 1,512 ఎకరాల విస్తీర్ణం.. 2.8 టీఎంసీల సామర్థ్యం
- రిజర్వాయర్ పూర్తయితే షాద్‌నగర్, పరిగి రైతులకు లబ్ధి



రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రామ్మోహన్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. పదేళ్ల క్రితమే రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటి వరకు తట్టెడుమట్టిని కూడా తవ్వలేదు. పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా అపరిష్కృతంగా మారిన ఈ నిర్మాణ ప్రదేశాన్ని గురువారం ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ సీతారాం నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం సందర్శించడంతో నిర్మాణ పనుల్లో మరోసారి కదలిక మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. సాంకేతిక అనుమతులకు తోడు నిధుల కేటాయింపు జరిగి, సకాలంలో రిజర్వాయర్ పూర్తయితే ఇటు రంగారెడ్డి, అటు వికారాబాద్ జిల్లాల్లోని 4.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్‌సిటీకి సైతం నీటి సరఫరా కానుంది. తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలు తీరనున్నాయి.

పదేళ్ల క్రితమే శంకుస్థాపన

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగూడెం మండలం పద్మారం రెవెన్యూ పరిధిలో 1,512 ఎకరాల విస్తీర్ణంలో సముద్ర మట్టానికి 670 మీటర్ల ఎత్తులో.. కట్టపొడవు 6.05 కిలోమీటర్లతో, 2.8 టీఎంసీల సామర్థ్యంతో కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ (చివరి ప్రాజెక్ట్)నిర్మించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 2015లోనే రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. తర్వాత ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించక పోవడం, పర్యావరణ అనుమతులు రాకపోవడం తదితర సాంకేతిక సమస్యలతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి ష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గత జనవరిలో ఇక్కడ పర్యటించి, త్వరలో భూసేకరణ ప్రారంభించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రిజర్వాయర్ నిర్మాణ పనుల పరిశీలన కోసం సాగునీటి పారుదలశాఖ ఇంజనీర్ల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించడంతో జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సామర్థ్యం పెంచాలని విజ్ఞప్తి

క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన ఇంజనీర్ల బృందంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమావేశమై సాంకేతిక అంశాలపై చర్చించారు. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యాన్ని 2.8 టీఎంసీల నుంచి 3.8 టీఎంసీలకు పెంచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సిందిగా సూచించారు. ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ సేకరణ, పనుల ప్రారంభంపై ఇప్పటికీ స్పష్టత రాలేదని, త్వరలోనే ఈ అంశంపై ప్రభుత్వం ఓ నిర్ణయం వెల్లడించే అవకాశం ఉందని, ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉంచనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచితే మరో 500 ఎకరాలకుపైగా భూమిని అదనంగా సేకరించాల్సి ఉంటుంది. తద్వారా పద్మారం, లక్ష్మీదేవిపల్లి, రాంజాతండా, సయ్యద్‌పల్లి సహా మరికొన్ని గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశం లేకపోలేదు.

ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధితో కృషి

కొందుర్గు: పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిచేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల రిజర్వాయర్ కోసం గుర్తించిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థలాన్ని వారు ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని నమ్మించి మోసం చేశాయన్నారు. ఈ రిజర్వాయర్‌కు ఉదండాపూర్ నుంచి నీటిని తేవడమే గాక దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల, జూరాల నుంచి నీటిని తెచ్చి త్రివేణి సంగమం చేస్తామని అన్నారు. ప్రస్తుతం 2.8 టీఎంసీలుగా ప్రతిపాదించిన రిజర్వాయర్‌ను 3.8 టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నివేదిక సిద్ధం చేస్తాం

ఇరిగేషన్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, సీతారామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల సూచనమేరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సామర్థ్యం పెంపుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 2.8 టీఎంసీలకు 1,512 ఎకరాలు అవసరమని, 3.8 టీఎంసీలు పెంచితే ఇంకా ఎంత భూమి అవసరమవుతుందో సర్వే చేస్తే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణా రెడ్డి, కావలి రాజు, నాయకులు మల్లేశ్‌గౌడ్, పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్ గౌడ్, చంద్రశేఖర్, నరేందర్, రామయ్య గౌడ్, కృష్ణయ్య, కృష్ణ, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



❖ వాగు దాటితేనే బడికి..

భారీ వర్షాలకు ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి శివారులోని వాగు నిండా ప్రవహిస్తోంది. వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. విద్యార్థులు వాగు దాటితేనే కానీ బడికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గురువారం ఉదయం వాగు దాటేందుకు ఇబ్బందిపడగా గ్రామస్తులు కొందరు వారిని ఇలా ఎత్తుకొని అవతలి వైపు దాటించారు. – షాద్‌నగర్

చిలుకూరు పెద్ద చెరువు పరిశీలన



వరదలో నడుచుకుంటూ వెళ్లి చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు

మొయినాబాద్: ప్రమాదస్థాయికి చేరిన చిలుకూరు పెద్ద చెరువును అదనపు కలెక్టర్ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. చెరువు అలుగు కింది నుంచి నీరు సాఫీగా వెళ్లేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెరువు అలుగు కింది భాగం నుంచి నాలా, సీసీ రోడ్డు నిర్మాణం, ఆర్ అండ్ బీ రోడ్డుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుపై పారుతున్న నీటిలోనుంచే వాహనాలు వెళ్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ పరమేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, సిబ్బంది వెంకటేశ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై ఇరుక్కున్న తహసీల్దార్ వాహనం

చెరువును పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్ గౌతమ్‌కుమార్ కారు కాలువ నీటిలో ఇరుక్కుపోయింది. అలుగు కింది భాగంలో కాలువపై ఏర్పాటు చేసిన రోడ్డులో కారు కొంత దూరం వరకు వెళ్లింది. అక్కడి నుంచి అధికారులు నడుచుకుంటూ వెళ్లారు. కారును వెనక్కి తిప్పే క్రమంలో రోడ్డుపై ఇరుక్కుపోయింది. అక్కడనున్నవారంతా పది నిమిషాల పాటు శ్రమించి బయటకు తీశారు.

మున్సిపల్ కార్యాలయంలో తనిఖీ

చేవెళ్ల: కొత్త మున్సిపాలిటీ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. చేవెళ్ల మున్సిపాలిటీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాత్కాలిక భవనంలో సెక్షన్లవారీగా ఏర్పాటు చేసిన అధికారుల చాంబర్లను పరిశీలించారు. కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వివరాలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో కావాల్సిన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



కందుకూరు: పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూలో నిలబడ్డ మహిళా రైతులు

25,000 మెట్రిక్ టన్నులు

ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో యూరియా డిమాండ్

- ఇప్పటి వరకు సరఫరా 21,000 మెట్రిక్ టన్నులు
- ఎరువుల దుకాణాలకు అన్నదాతల బారులు
- ఒక్కో రైతుకు రెండు, మూడు సంచులతో సరి
- పంటకు సరిపడా దొరక్క ఆందోళన



షాబాద్: హైతాబాద్ సహకార సంఘం కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వరుణుడు కరుణించినా.. వ్యవసాయశాఖ కరుణించకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏకధాటి వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. బోరుబావుల్లో నీటి నిల్వలు పైకి ఉబికి వస్తున్నాయి. ఫలితంగా చెరువుల కిందే కాదు బోరుబావుల కింద వరిసాగు పెరిగింది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల ఎకరాల్లో పంట సాగైనట్లు అంచనా. వీటిలో 1.20 లక్షల ఎకరాల్లో పత్తి, లక్ష ఎకరాలకుపైగా వరి సాగు, మరో 60వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పైకి ఉబికి వస్తుండటంతో రైతులు వరిసాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే చాలామంది వరినాట్లు పూర్తి చేశారు. పత్తి పూత, కాపు దశకు చేరుకుంది. చేను ఏపుగా పెరిగేందుకు యూరియా చల్లాల్సి ఉంది. అందు కోసం ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలు, ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం మూతపడటం, మద్రాసులోని పలు కేంద్రాల్లోనూ ఉత్పత్తి తగ్గించడంతో దిగుమతి తగ్గింది. ఇదే సమయంలో జిల్లా డిమాండ్‌ను అంచనా వేయలేక పోయారు. డిమాండ్‌కు సరఫరా మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడింది. ప్రస్తుత సీజన్‌లో జిల్లాకు 25,000 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, ఇప్పటి వరకు 21 మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుమతి అయింది. ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న ఎరువులను 27 ప్రభుత్వ మార్క్‌ఫెడ్ (60శాతం) పీఏసీఎస్‌లు సహా 156 ప్రైవేటు డీలర్ల (40శాతం) ద్వారా రైతులకు చేరవేస్తున్నారు. పంట డిమాండ్ మేరకు మార్కెట్లో ఎరువులు దొరకడం లేదు.

ఉదయాన్నే క్యూ..

రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు పట్టుకుని ఉదయాన్నే ఆయా కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. పది బస్తాలు అవసరం ఉన్నవారికి ఐదు బస్తాలతో సరిపెడుతున్నారు. మరో దఫా మిగిలి నవి ఇస్తామని చెప్పి పంపుతున్నారు. ఇదే సమయంలో కొంత మంది డీలర్లు ఎరువులను గుట్టుగా ప్రైవేటు గోదాములకు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి విక్రయిస్తున్నారు. రైతులు చేసేది లేక వారు చెప్పిన ధరలు చెల్లించి తీసుకెళ్తున్నారు. తాజాగా గురువారం కడ్తాల్, కందుకూరు, మంచాల, షాబాద్, శేరిగూడ, యాచారం, కేశంపేట తదితర ప్రాంతాల్లో ఎరువుల కోసం ఎగబడ్డారు. విక్రయ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఎరువులను మండల వ్యవసాయాధికారులు పోలీసుల పహారాలో అందజేశారు. కొన్ని చోట్ల రైతులు వ్యాపారులతో వాగ్వాదానికి దిగారు. డిమాండ్ మేర సరఫరా చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు.

నిషేధిత జాబితాలో ఉన్న భూములు విడిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

హిమాయత్‌నగర్: మహేశ్వరం మండలం కొంగర కుర్దు-ఎ గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 600 ఎకరాల భూములను విడిపిస్తానని ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని గ్రామరైతులు డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిషేధిత జాబితాలో చేర్చడంతో 200 ఎకరాల్లో రైతు కుటుంబాలు వ్యవసాయం చేసుకోలేక ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. రాజకీయ నేతల అండదండలతో కొంతమంది కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ భూములన్నీ ఇనాం, వక్ఫ్, వ్యవసాయానికి చెందినవిగా పహణీలో ఉన్నాయని స్పష్టం చేశారు. భూములపై గతంలో కొంతమందికి ఇచ్చిన ఓఆర్‌సీ కన్వర్షన్ రద్దుచేయాలని, భూములను విడిపించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రైతులు ఎస్.వెంకటేశ్ గౌడ్, ఎస్.కృష్ణారెడ్డి, వై.వేణుగోపాల్, జంగయ్య, ఆర్.శేషగిరిరావు, వై.గోపాల్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీజీ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు లింగమొళ్ల దర్శన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేపట్టిన ఉద్యోగుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్1 తర్వాత నియామకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని వర్తింపజేయడం ద్వారా ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ రాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే ఆత్మగౌరవ సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్‌బాబు, నాయకులు ఈశ్వర్, సునీల్, వినోద్‌కుమార్, ముత్యాలు, రాఘవేందర్‌రావు, సుధాకర్, ఖాదర్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఈగలు, దోమల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని, వైద్య సిబ్బంది వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించి తగిన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా వ్యాధుల బారిన పడితే వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని, కావల్సిన మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారులు సెలవుపై వెళ్లొద్దు

- వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు, రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, ఎలాంటి ప్రమాదాల సంభవించకుండా చూడాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల నియోజక వర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగు పరుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో అధికారులు సెలవులపై వెళ్లొదన్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలన్నారు. వైద్యులు, సిబ్బంది కచ్చితంగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మున్సిపాలిటీల్లో చెత్తచెదారం, మురికి నీరు నిల్వకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ పంపిణీలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్‌లో పెద్దఎత్తున నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ ఏడాది మంజూరు చేసిన ఐదు వేల ఇందిరమ్మ ఇళ్లలో నాలుగు వేలు గ్రౌండింగ్ పూర్తి కావాలని ఆదేశించారు. కొలతలకు తగ్గట్టుగా స్థలాలు లేకపోవడంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని గుర్తించి సరి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజుతోపాటు ఆయా మండలాల ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



తలకొండపల్లి ధర్నాలో మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. హామీల అమలు విఫలమైందని ఎద్దేవ చేశారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాండుప్రసాద్, మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు పాండు, అనిల్, రాజు, శ్రీనివాసాచారి, సుదర్శన్, శేఖర్‌రెడ్డి, శాంతకుమారి, గిరి పాల్గొన్నారు.

6వ తేదీలోపు గణేశ్ నిమజ్జనం చేయండి

వీహెచ్‌పీ ఆంధ్ర, తెలంగాణ సేవ ప్రముఖ్ రమేశ్

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆంధ్ర, తెలంగాణ సేవ ప్రముఖ్, గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బండారి రమేశ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 7న చంద్రగ్రహణం ఉన్నందున 6వ తేదీన గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపాల నిర్వాహకులు డీజేను పెట్టకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసు, పురపాలిక, విద్యుత్, అగ్నిమాపక అధికారుల ఫోన్ నంబర్లు నిర్వాహకుల వద్ద ఉండాలని అన్నారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామశివారులో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(50) రాయికల్ శివారులోని జాతీయ రహదారి పక్కన వినాయకస్వామి దేవాలయం సమీపంలో అనుమానా స్పదంగా మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని చూసినవారు 100 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారాన్ని అందించారు. పోలీసులు ఘటనా స్థలానికిచేరుకొని పరిశీలించారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు షర్టు, గ్రే కలర్ ప్యాంటు ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ లభించినా, వివరాలు తెలిసినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారంఅందించాలని సూచించారు.

మొబైల్ షాపు దగ్ధం



చెల్లాచెదురుగా పడిన సామగ్రి

కడ్తాల్: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ మొబైల్‌షాపు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అన్మాస్‌పల్లికి చెందిన కాళ్ల గణేశ్ కడ్తాల్‌లోని ఉప్పరి మల్లయ్య కాంప్లెక్స్‌లో ఓ షటర్ అద్దెకు తీసుకుని మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి.. ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. గురువారం ఉదయం షాపు వద్దకు వెళ్లిన బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు.

పెయింటర్ దారుణ హత్య..

సనత్‌నగర్: ఓ పెయింటర్ హత్యకు గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తాను పనిచేసే చోట మహిళతో చనువుగా ఉండడాన్ని గుర్తించిన ఆమె భర్త, కుటుంబ సభ్యులు చితకబాదడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన బబ్లూ (22) నగరానికి వలసవచ్చి పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భరత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మేస్త్రీ రాజారామ్‌తో పాటు అతని భార్య, మామ రవీందర్, అత్త కౌసల్య, బాబాయి రాజేంద్రలు కూడా అదే భవనంలో కార్మికులుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. బుధవారం రాత్రి రాజారామ్ భార్య బబ్లూతో కలిసి ఉండటాన్ని గుర్తించాడు. ఈ విషయాన్ని మామ రవీందర్, బంధువులకు చెప్పడంతో అందరూ కలిసి బబ్లూపై దాడి చేయడంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని వాచ్‌మెన్ మల్కాజిగిరిలో ఉంటున్న బబ్లూ సోదరుడికి చెప్పడంతో అక్కడికి వచ్చిన అతను బబ్లూను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బూబ్లూ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజారామ్, రవీందర్, కౌసల్య, రాజేంద్రలను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కేసులో సహకరిస్తాం

మహీంద్రా యూనివర్సిటీ వీసీ డాక్టర్ యాజుల మేడూరి

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి లోని మహీంద్రా యూనివర్సిటీలో గంజాయి, డ్రగ్స్ పట్టుబడిన ఘటనపై దర్యాప్తులో పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ యాజుల మేడూరి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాము క్రమశిక్షణ, నిజాయితీ, చట్టానికి గౌరవం వంటి అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. ఇటీవల కొందరు విద్యార్థులకు నార్కోటిక్స్ కేసులో ప్రమేయం ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల వినియోగం, కలిగి ఉండటం లేదా పంపిణీ చేయడాన్ని విశ్వవిద్యాలయం ఖండిస్తుందని, తమ యూనివర్సిటీ జీరో టాలరెన్స్ పాలసీని అనుసరిస్తుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే, లేదా తమ విద్యార్థి సమాజం భద్రత, సంక్షేమాన్ని ప్రమాదంలోకి నెట్టే ఏ చర్యకైనా విశ్వవిద్యాలయ నియమావళి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు తాము పూర్తిగా సహకరిస్తున్నామన్నారు. తమ సంస్థ విలువలు, సమగ్రతను కాపాడటానికి అవసరమైన ప్రతి చర్య తీసుకుంటూ, సురక్షితమైన, బాధ్యతాయుతమైన, క్రమశిక్షణతో కూడిన క్యాంపస్ వాతావరణాన్ని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల ఎదురయ్యే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.. విద్యార్థులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వర్సిటీ విలువలను కాపాడాలని కోరారు.

సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మెమో జారీ

అనంతగిరి: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. ఆనంద్‌కు కలెక్టర్ మెమో జారీ చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న 9 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కలెక్టర్ అనుమతి లేకుండా, ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా బదిలీ చేయడం జరిగింది. దీంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరిపాలన పనులకు ఆటంకం ఏర్పడింది. అట్టి మెమోకు ఒక్క రోజులో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

నానోతో లాభాలెన్నో..

- ద్రవరూప యూరియాతో తక్కువ ఖర్చు, తక్కువ శ్రమ, ఎక్కువ పనితీరు
- రైతులు అవగాహన పెంచుకోవాలి
- వ్యవసాయ శాఖ అధికారులు



నానో యూరియా, నానో డీఏపీ బాటిళ్లు

కందుకూరు: యూరియా కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్క బస్తా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దీన్ని అధిగమించడానికి ప్రస్తుతం మార్కెట్లో ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులు దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. యూరియాను కొని పొలాలకు తరలించే మోత బరువు తగ్గుతుందని పేర్కొంటున్నారు. నానో ద్రవ రూపంలో ఉండటంతో ఇతర పెస్టిసైడ్స్ మాదిరిగానే తీసుకెళ్లి పంటలపై పిచికారీ చేసుకోవచ్చు.

సాధారణ యూరియా..

- సాధారణ యూరియా 45 కిలోల బస్తా ధర రూ.266.50 ఉంది.
- ఎకరాకు 2 నుంచి 4 బస్తాలు అవసరం అవుతుంది.
- రవాణా ఖర్చు అదనం.
- 35 శాతం నత్రజని మాత్రమే పంటకు అందుతుంది. మిగిలిన నత్రజని ఆవిరైపోతుంది.
- దీని పనితనం పంటపై 2- 3 రోజులు మాత్రమే ఉంటుంది.
- వేర్ల నుంచి ఆకులకు పంట పైభాగాలకు నత్రజని తక్కువగా చేరడంతో పాటు ఎక్కువ సమయం తీసుకుంటుంది.
- యూరియా బస్తాలను వాడకుండా వదిలేస్తే రెండు నెలల తర్వాత గడ్డ కట్టే అవకాశం ఉంది.
- ఎరువుల కంపెనీలు యూరియా ఉత్పత్తికి అంతరాయం కలిగితే కొరత ఏర్పడుతుంది.
- ప్రభుత్వం ప్రతి యూరియా బస్తాపై రూ.1,970 చొప్పున కంపెనీలకు రాయితీ రూపంలో చెల్లిస్తుంది. వీటి భారం పరోక్షంగా ప్రజలపై పడుతుంది.

నానో యూరియా...

- నానో యూరియా 500 మి.లీ ధర రూ.225 నుంచి ఎంఆర్పీ ప్రకారం దొరుకుతుంది.
- ఎకరాకు 500 మి.లీ. బాటిల్ సరిపోతుంది.
- రవాణా ఖర్చు ఉండదు.
- మొక్కలకు 80 శాతం నత్రజని అందుతుంది.
- దీని పనితనం పంటపై 8- 10 రోజులు ఉంటుంది.
- పంటపై నేరుగా పిచికారీ చేయడంతో మొక్క అన్ని భాగాలకు సులభంగా చేరుతుంది.
- ఏడాది వరకు ఉపయోగించుకోవచ్చు.
- ఎరువుల కంపెనీలు నానో యూరియా ఉత్పత్తికి అంతరాయం కలిగే అవకాశమే లేదు. దీని ఉత్పత్తిని తక్కువ ఖర్చుతో తక్కువ స్థలంలో చేసుకోవచ్చు. ప్రస్తుతం నానో యూరియాతో పాటు నానో డీఏపీ కూడా మార్కెట్లో అందుబాటులో ఉంది.

విరివిగా వాడాలి



ప్రస్తుతం యూరియా కొరతను అధిగమించేందుకు నానో యూరియా వాడాలి. దీన్ని సులువుగా పొలాలకు తరలించవచ్చు. రైతులందరూ విరివిగా నానో యూరియా వినియోగించాలి.

– జగదీశ్వర్‌రెడ్డి ఆర్డీఓ, కందుకూరు

యూరియాలాగే పనిచేస్తుంది



నానో యూరియా కూడా యూరియా మాదిరిగానే పనిచేస్తుంది. రైతులు ధైర్యంగా వాడుకోవచ్చు. పంట ఖర్చు కూడా తగ్గుతుంది. కొరతను అధిగమించడానికి ఇది ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది.

– లావణ్య, ఏఓ, కందుకూరు

రూ.2 లక్షలు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తారా?

- లేదంటే వారి జీవితాలతో ఆడుకుంటారా?
- సెప్టెంబర్ 2న వ్యక్తిగతంగా హాజరు కావాలి
- వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యానికి హెచ్‌ఆర్‌సీ ఆదేశం

సిటీ కోర్టులు : విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడానికి రూ.2 లక్షలు డిమాండ్ చేస్తారా? లేదంటే సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి జీవితాలతో ఆడుకుంటారా? అని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వెంకటేశ్వర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 2021-25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులు నల్లగొండ జిల్లా చర్లపల్లిలోని వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బీ ఫార్మసీ పూర్తి చేశారు. తమకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని 9 మంది విద్యార్థులు మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఎం.ఫార్మసీ కోర్సులో ప్రవేశం పొందేందుకు అడ్మిషన్ పోర్టల్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడానికి సెప్టెంబర్ 2 చివరి తేదీ అని, ఆ లోపు చేయకుంటే తాము ఎం-ఫార్మసీకి అవకాశం కోల్పోతామని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని, లేని పక్షంలో ఒక్కో విద్యార్థి రూ.2 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం డిమాండ్ చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేయడమేంటని కళాశాల యాజమాన్యంపై మండిపడింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యమైతే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి భవిష్యత్‌ను దెబ్బతీస్తారా అని ప్రశ్నించింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం ఆర్టికల్ 21 ప్రకారం విద్యా హక్కును ఉల్లఘించడమే అని కమిషన్ అభిప్రాయపడింది. వెంటనే విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేసి వచ్చే విచారణకు కళాశాల ప్రిన్సిపాల్, చైర్మన్ వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని నల్లగొండ కలెక్టర్‌కు అందజేయాలని కమిషన్ కోర్టు అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా వేసింది.

ఖాళీ జాగా వేసేయ్ పాగా..

నకిలీ డాక్యుమెంట్లతో స్వాహా

- రూ.5 కోట్లు విలువ చేసే 3 ప్లాట్ల విక్రయం
- 8 మంది అరెస్టు
- పరారీలో మరో ఆరుగురు

కీసర: రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి ఓ బైక్ మెకానిక్ నకిలీ పత్రాలు సృష్టించి రూ. 5 కోట్లు విలువైన ఐదు ప్లాట్‌లను కొట్టేశాడు. అందులో మూడు ప్లాట్లను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రాచకొండ ఎస్ఓటీ, కీసర పోలీసులు 8 మందిని అరెస్టు చేశారు., మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లికి చెందిన అరవింద్ బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అతను అదే ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వాపారులు సంపంగి సురేష్ , ఈగ హరిప్రసాద్‌లతో కలిసి ఖాళీ స్థలాలకు నకిలీ పత్రాలు రూపొందించి వాటిని విక్రయించి రూ. కోట్లు సంపాదించాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా అరవింద్ రాంపల్లి ప్రాంతంలోని ఖాళీ ప్లాట్లను గురిస్తాడు. అందులో మొదటి సేల్ డీడ్ మాత్రమే ఉన్న ప్లాట్‌లలో ఎలాంటి ఫెన్సింగ్ లేకుండా ఉన్న వాటిని ఎంచుకుంటాడు. సేల్ డీడ్‌లో ఉన్న పేరు, చిరునామాలను ఆరా తీసి యజమానుల వివరాలను సేకరించేవాడు. అనంతరం ఈసీ, సర్టిఫైడ్ సేల్ డీడ్ కాపీలను తీసి వాటి ద్వారా నకిలీ పత్రాలను సృష్టిస్తాడు. అనంతరం వాటిని విక్రయించి ఈ ముగ్గురు పంచుకునేవారు. వీరు ప్లాట్ యజమాని బతికి ఉండగానే అతను చనిపోయాడని, ఆయన భార్య కుడా మృతి చెందిందని, వారికి సంబంధించిన డెత్ సర్టిఫికేట్‌లను తయారు చేశారు. వారి వారసురాలిగా ఓ యువతికి డబ్బు ఆశ చూపించి ఆమెతో రూ. 75 లక్షల విలువ చేసే ప్లాట్‌ను విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ ముఠా సభ్యులు 5 ప్లాట్లకు నకిలీ పత్రాలు రూపొందించి మూడు ప్లాట్లను విక్రయించినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.ఈ వీరు రాంపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 281, 282, 283, 422, 403, 421, 560, 561, 281, 282, 283,లో 1800 గజాలకు సంబంధించిన ప్లాట్లకు నకిలీ పత్రాలు రూపొందించినట్లు తెలిపారు.ఈ ముఠాలో సభ్యులపై 11 కేసులు ఉన్నట్లు తెలిపారు. బీగూడెం అరవింద్, సంపంగిసురేష్, ఈగ హరిప్రసాద్ మహ్మద్ హుస్సేన్, యంజాలశేఖర్ వీరమచినేని వనజలను పోలీసులు అరెస్టు చేశారు. అమరేంద్ర , మాణిక్, అహ్మద్,ముసుకు సునీల్ కుమార్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

లేని చట్టం పేరు చెప్పి రూ.33 లక్షలు స్వాహా!

- డిజిటల్ అరెస్టు పేరుతో టోకరా
- బాధితుడు బోయిన్‌పల్లికి చెందిన వృద్ధుడు
- సైబర్‌క్రైం పీఎస్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ఎక్కడా లేని చట్టం పేరు చెప్పిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వృద్ధుడిని నిలువు దోపిడీ చేశారు. నేషనల్ సీక్రెట్స్ యాక్ట్ అంటూ డిజిటల్ అరెస్టు చేసి ఏకంగా రూ.33.4 లక్షలు కాజేశారు. దాదాపు 15 రోజుల పాటు దఫదఫాలుగా ఈ మొత్తం చెల్లించిన బాధితుడు ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన వృద్ధుడికి (73) గత నెలలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను కర్ణాటకకు చెందిన క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ఆధార్ కార్డు దుర్వినియోగం అయ్యిందని, అశ్లీల సాహిత్యంతో పాటు మనుషుల అక్రమ రవాణా వ్యవహారంలో దానిని వినియోగించారని చెప్పాడు. ఈ మేరకు తమ వద్ద క్రిమినల్ కేసు నమోదైందని భయపెట్టాడు. ఇది నేషనల్ సీక్రెట్ యాక్ట్-1923కి సంబంధించిన అంశం కావడంతో తదుపరి విషయాలు తమ ఉన్నతాధికారి మాట్లాడతారంటూ చెప్పాడు. ఆపై ఐపీఎస్ అధికారి దయా నాయక్ పేరుతో మరో వ్యక్తి బాధితుడిని ఫోన్ చేశాడు. తాను ఎలాంటి నేరం చేయలేదని, ఆ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని బాధితుడు దయా నాయక్‌తో చెప్పాడు. అది నిరూపితం అయ్యే వరకు డిజిటల్ అరెస్టులో ఉండాలంటూ బాధితుడితో చెప్పిన ఇతగాడు ఆయన భార్యకూ దీనిని వర్తింపజేశాడు. తమ అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లొద్దని, తాము చెప్పే వరకు ఈ విషయం మరొకరికి తెలియకూడదని షరతు విధించాడు. అప్పటికే తీవ్రంగా భయపడిన బాధితుడు, ఆయన భార్య అతడి మాటలు నమ్మారు. ఆపై అసలు కథ మొదలుపెట్టిన సైబర్ నేరగాళ్లు నిర్దోషిత్వం నిరూపించుకోవాలంటూ 'ఫండ్ వెరిఫికేషన్' విధానం అమలు చేయాలని, దీనికోసం తాము పేర్కొన్న బ్యాంకు ఖాతాల్లోకి రూ.15 లక్షలు చెల్లించాలని చెప్పాడు. పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత కేసు మూసేయడంతో పాటు ఆ మొత్తం రీఫండ్ చేస్తామని నమ్మబలికారు. దీంతో బాధితుడు ఆ మొత్తం బదిలీ చేశారు. ఆపై మరి కొన్ని పేర్లు చెబుతూ ఇంకొంత కాజేశారు. ఇలా గత నెల 25 నుంచి ఈ నెల 8 వరకు బాధితుడు మొత్తం రూ.33.4 లక్షలు డిపాజిట్ చేశారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. ప్రస్తుతం దేశంలో అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ అమలులో ఉంది తప్ప నేషనల్ సీక్రెట్స్ యాక్ట్ పేరుతో ఎలాంటి చట్టం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

యువతి అదృశ్యం



పూజ (ఫైల్)

మాడ్గుల: యువతి అదృశ్యమైన సంఘటన మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఫిరోజ్‌నగర్ గ్రామానికి చెందిన పూజ(25) మంగళవారం ఉదయం తల్లిదండ్రులు నిద్రలేచి చూసే సరికే ఇంట్లో కనిపించలేదు. స్నేహితులు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో మరుసటిరోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మూసీనదిలో యువకుడి గల్లంతు

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ వద్ద మూసీ ప్రవాహంలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంకర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సలీం (32) కూలీగా పని చేస్తున్నాడు. గురువారం తాగిన మత్తులో అతను ఈత కొట్టేందుకు మూసీ నదిలోకి దూకాడు. నదిలో ప్రవాహం ఉధృతంగా ఉండటంతో గల్లంతయ్యాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి గాలింపు చేపట్టారు.

యువతితో అసభ్య ప్రవర్తన..

ఇద్దరు యువకుల రిమాండ్.

బంజారాహిల్స్: తనతో పనిచేస్తున్న ఉద్యోగితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఇద్దరు యువకులు తమ బైక్‌ను అడ్డగించి తనను దుర్భాషలాడటమేగాక తాను వేసుకున్న డ్రెస్‌పై కామెంట్లు చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడ్డారంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఇద్దరు యువకులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బేగంపేటలో నివసించే ఓ యువతి ఈ నెల 22న ఆరోగ్యం బాగోలేకపోవడంతో తనతో పనిచేస్తున్న యువకుడితో కలిసి బైక్‌పై ఆస్పత్రికి వెళ్తుంది. అయితే కార్ఖానాకు చెందిన సోహైల్, రిజ్వాన్‌ఖాన్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై ఆమెను వెంబడించి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో అడ్డగించారు. ఇతర మతస్తుడితో ఎందుకు వెళుతున్నావంటూ ఆమెను నిలదీశారు. మెడికల్ ఎమెర్జెన్సీ ఉండడంతో ఆస్పత్రికి వెళ్తున్నానని, తనతో పనిచేస్తున్న ఉద్యోగి ఆస్పత్రికి తీసుకువెళ్తున్నాడని ఆమె బతిమిలానా వినిపించుకోకుండా దర్భాషలాడారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు పరారీలో ఉన్న నిందితులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పంజాబ్ ప్రయాణికుడి వద్ద బుల్లెట్ల పట్టివేత

శంషాబాద్: పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు లభ్యమైన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం రేపింది. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్ట్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం, భవానిగర్గ్‌కు చెందిన సుఖ్‌దీప్ సింగ్ ఇండిగో విమానంలో గురువారం వయా ఢిల్లీ నుంచి అమృత్‌సర్ బయలుదేరే విమానంలో బోర్డింగ్ అవుతుండగా భద్రతాధికారులు అతడి లగేజీని పరిశీలించారు. అందులో 02.ఎంఎం నాలుగురౌండ్లు, 0.7 ఎంఎం రెండు రౌండ్లు, 7.52 ఒక రౌండు ,7.62 ఒక రౌండు లభ్యమయ్యాయి. బుల్లెట్లకు సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లు అతడి వద్ద లేకపోవడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాడు.ఈ నెల 22 తాను నాందేడ్ నుంచి గురుద్వార్‌కు బస్సులో ప్రయాణం చేసినట్లు అతడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.